


కాంగో రాజకీయాల్లా, సభ గందరగోళంగా ఉంది. ఇరవయో శతాబ్ది జీవితం చీకాకుగా ఉంది. చేతకాని వాడి చేతిలో ఆర్కెస్ట్రా వాయిద్యాలలా ఈలలు, కేకలు తలో అపశ్రుతి లాగ పలుకుతున్నాయి. పలకరింపులు, ఛీత్కారాలూ, స్వగతాలూ, జనాంతికాలూ, ఆహోలు, ఈహీలు, ఊహూలు (అప్పు లడిగినవాళ్ళకి), ఓహోలు, హిహిలు, విమర్శలు, పరామర్శలు, హేళనలు, హేషలు, ఘీంకారాలు, కిచకిచలు, కిలకిలలు, రంకెలు, కేరింతలు వగైరాలతో శబ్దం శతసహస్ర ముఖాలుగా ధ్వనించి ప్రతిధ్వనించి క్రమంగా పరిహద్దుదాటి నిశ్శబ్దం స్థాయికి చేరుకుంటోంది. టాపు లేచిపోతే తాము కూలిపోతా మన్న భయంకొద్దీ పంకాలు విపరీతమైన వేగంతో తిరుగుతూ శబ్దాన్ని తొక్కేస్తున్నయి కిందకి. నిన్న సాయంకాలం సభ తాలూకు నిర్వాహకులు, నేటి సమావేశకర్తలు నిన్న పెట్టిన అల్లరిని తలుచుకొని అక్కసుకొద్దీ అల్లరిలో ఇవాళ బాకీ తీర్చేయడమేకాక అప్పు కూడా ఇస్తున్నారు. సభ సాయంకాలం ఐదున్నర కొట్టి ఆరున్నరకి సగమేనా కాకపోతుందా అన్న ధీమాతో వచ్చి మొదలైనా కాకపోవడంతో చిన్నపుచ్చుకున్న పెద్దలు ఏడుకాగానే మండిపడడం మొదలెట్టారు. జన్మలో ఎప్పుడు ఇలా పెందరాళే తగలళ్ళేదు ఇన్నాళ్ళకిక్కడ అవమాన మయిందని తిడుతున్నారు. "ఇండియన్ పంక్చువాలిటీ సార్", అని ఆ పెద్దలదృష్టిలో పడబోయిన సన్నకారు జనం పాత పాతవిట్లుతో సెటైర్ ప్రయోగిస్తున్నారు. మరికొందరు పాత సెటైర్లని 'రీ ట్రెడ్' చేయించుకొచ్చి సభంతా

దొర్లిస్తున్నారు. పాటలూ, పద్యాలూ, కప్లెట్లూ, వగయిరా లలితకళలుకూడ వర్ధిల్లుతున్నాయి.

విసుగెత్తిన ప్రయాణీకుడు ఈల వేస్తే, అది కండక్టరు ప్రజ్ఞే అనుకొని బస్సు కదిపిన డ్రైవరులా ప్రార్థన పద్యాలాయన మూడోమాటు మైకు ముందుకొచ్చి పద్యం మొదలెట్టి కరతాళ ధ్వనులమధ్య అర్ధాంతరంగా వెనక్కెళ్ళిపోయి తూ నా బొడ్డు అనుకుంటున్నాడు.

"అంతా నాటకంలా ఉంది" అన్నాడు ప్రస్తుతానికి మసిబారిన చిమ్నీలో కూరున్న ఒక తెలుగు దీపకళిక నిరతంగా.

"హిది నాటకం హోలేనా అసలూ" అన్నాడు సాటివెలుగు కసుక్కున నవ్వి చటుక్కున తన ముందున్న గడ్డపాయన వెనక తలదాచుకుంటూ.


* * *

అది నాటకం హోలే. పెద్దరకం సభలకి అది పుచ్చుకుంటూ ఉంటారు. అవతలివాడు ఏ మంత్రో అయితే మరీను. నాటకరంగం వెనుకనే ఉన్న గ్రీన్‌రూమ్‌లో ఒక కాబోతున్న మంత్రిగారూ, సభ నిర్వహణలో ఆ పూట కొచ్చిన వక్తలూ చేరి చాలా ఖంగారు పడుతున్నారు.

"ఎబ్బే లాభం లేదండీ. మన వెంత పూలతో కప్పేసినా కనిపిస్తాయి. ఎబ్బెట్టుగా ఉంటుంది" అన్నాడు ఒకవక్త.

అందరూ సన్మానితుడికేసి జాలిగా, భయంగా చూశారు. ఆయన పేరు సుబ్బన్నగారట. మహాభక్తుడు. వినయభూషణుడు. దారుణమైన వినయంట. పొరుగూరునుంచి ఒక పెద్దమనిషీయన్నిక్కడికి పంపి సన్మానం చేయించమని చీటీ రాసిచ్చాడు.

కాబోతున్న మంత్రిగారికి పబ్లిసిటీ కాంపెయన్ కార్యక్రమంలో ఒక సన్మాన సభకూడాఉంది. సరే ఈయన వేళకొచ్చాడని ఆయన బలగం సన్మానానికీయన్ని బుక్‌చేసి పబ్లిసిటీఇచ్చారు ఇంత విపరీతమైన వినమ్రుడు ఈయనేననీ, అసలు లోకంలో వినయం నిండుకోడానిక్కారణం ఉన్నదంతా పోగై ఈయనగా కరడు కట్టుకు పోడమేననీ వెల్లడించారు. ఈ చమత్కారమే ప్రధానంగా మంత్రిగారి అధ్యక్షోపన్యాసం, ముఖ్యకర్త ఉపన్యాస భాగంగా ఏర్పాటు అయ్యాయి. తీరా సభ వేళకి వినయ భూషణుడు సుబ్బన్న గారికి తనంత వినయశీలుడు లేడన్న గర్వం గంటకి బోలెడు చొప్పున పెరిగిపోయింది.ఇష్టాగోష్ఠి జరుగుతుండగానే కణతలపైన దురదవేసినట్టయి రెండు



" బుజ్జీ! మీ బావ నిద్రపోతున్నారు. మోతలేకుండా, అల్లరిచెయ్యకుండా కాల్చుకోండి!"

మూడుసార్లు తడుము కున్నాడు. తరవాత రెండు చిన్నబోడిపెలు వచ్చాయి.

సెగ్గడ్డలా అన్నాడుకొంచెం లేటుగా వచ్చినాయన అవిచూసి. మీ అహంకారపు వేడిని కంట్రోలుచేసే థర్మాస్ బోడిపెలు అన్నాడొక ఆధునిక కవి. సుబ్బన్నగారు వినయంగానే నవ్వారు గాని ఆ బోడిపెలు రెండు హఠాత్తుగా బారెడు కొమ్ములుగా పెరిగి చివర సుడితిరిగాయి. అంతా ఖంగారు పడ్డారు.

కాబోయే మంత్రిగారు ఇలాటి సన్మానసభలో అధ్యక్షతకి సుతరాము ఒప్పుకోలేదు.

"ఈననుంచి మనకేం తెలీదు. వినయం ఉందన్న పరువుతప్ప. తీరా అది కాస్తా ఇలా తగలడింది. ఏం జూసి మాటాడమంటావయ్యా" అన్నారు కా. మంత్రిగారు సుబ్బన్న కొమ్ముల కేసి చూస్తూ.

ఎవరో తలుపు తీశారు. అవతల సభామందిరం లోంచి హాహాకారాలు ఈలలూ హోరెత్తాయి.

'కొమ్ములు కొట్టించేద్దాంలెండి' అన్నాడు పెద్ద, తలుపు మూశాక.

'మళ్లీ మొలుస్తాయి.'

'అయినా నేను ఇంక ఈయనమీద ఉపన్యసించడంకల్ల' అన్నాడు ఒకకర్త

'పోనీ ఇంకెవర్నైనా కేకేద్దామా?'

'ఇంకోడిమీద నేను చస్తే మాటాడను. ఆ మాటకొస్తే మాటాళ్ళేను. ఈయనమీద ఫస్టాసు హ్యూమరస్ స్పీచ్ ప్రిపేరుచేసుకొచ్చాను' అన్నాడు మరో వక్త.

'దానికేముందండీ. ఆ వచ్చేవాడిమీదే ప్రయోగించండి.'

'అంత బతిమాలడమేల? అరుగో వారున్నారు; నేనున్నాను. ఇద్దరం చాలం? ఇప్పటికే కాలాతీతం అయింది కూడా. వక్తలు తక్కువైతేనే మంచిది' అన్నారు శాస్త్రులవారు.

ఆయనకి సన్మానితుడు ఒకడైనా, సభ ఏదైనా ఫరవాలేదు. నన్నయ్య తగలేసిన వజ్జాలన్నీ ఎర్రన్న నెత్తిన రుద్దేస్తున్నారన్నది ఆయన ఎజెండా. దానిమీద ఉపన్యసిస్తూ, తన శత్రువు డైన సమానుడైన తిక్కన్నని ఉతికేసెయ్యడం ఆయన పరమార్థం. వేరుశనక్కా.య సభలోనైనాసరే ఆయన ఈ ఉపన్యాసాన్ని అన్వయించి మాటాడేసి, ''కాబట్టి వేరుశనగకు వాగన్లు త్వరగా సప్లయి చెయ్యాలి'' అని ముగించ గలడు.

ఇది అందరికీ తెలుసు.

"పోనీ ఈ ప్రజ్ఞను పట్టుకుని, ఈ కంకన శాస్త్రులవారికి సన్మానం చేసేస్తే?'' అన్నాడు నిర్వాహకుడు.

ఒక ఉత్సాహి గబుక్కున తలుపు తీసి అవతలకెళ్లాడు. కేకలకెరటం గదిని ఊపేసింది. వెళ్లినవాడు వేదిక మీదికెక్కి, 'ఆర్యులారా! చిన్న మార్పు. సన్మానితుడు సుబ్బన్నగారు కాదు. శాస్త్రులవారు. కారణం నేలమీద నిలబడ్డం' అని టూకీగా ప్రకటించాడు.

* * *

కా. మంత్రిగారి కార్యదర్శి ఉత్సాహంతో ఎగిరి గంతువేశాడు. "ఔను ఔనౌను. బెస్టు ఔను. మరొహడైతే ఇంత రీసెర్చి చేసినందుకు పట్టపగ్గా ల్లేకుండా ఉండేవాడు కాదనీ, నేలమీద నిల్చేవాడు గాడనీ, ఈయన నేలమీదే ఉండడంవల్ల మహా వినయశీలుడనీ కూడా బయటపడి పోతూందనీ—''

అనుకోకుండా శాస్త్రులవారి పాదాలకేసి చూసిన ఆ ఉపసభ వారంతా ఏకగ్రీవంతో కేరింత కొట్టారు.

శాస్త్రులవారు నేలమీద లేరు. పాదాలు నేలకి బాగా అరంగుళాల ఎత్తున ఉన్నాయి. శ్రీవారుకూడా సంస్కృతంలో బావురుమన్నారు. మందః కవియశః పార్థీ అని చూశారు, గద్గద స్వరంతో, గర్వం అణిగిపోతుందేమోనన్న దురాశతో.



"మీ ఇద్దరిలో ఎవరిది తప్పు ?"
"నాదేనయ్యా! ఈమె ఈదారిని వస్తుందని తెలిస్తే ప్రక్కవీధిలోనుంచి పారిపోయి ఉందును."

'బాబోయ్ ఆ కాళిదాసు ఊసెత్తకు. వాడలా అన్నాడుగాని వాడికి మహా లావుఅహం' అన్నాడాయన బావమరిది.

* * *

ఒక మహానటుడు తలుపు తీసుకొచ్చాడు. ఈలలతో, కేకలతో గది అదిరిపోయింది.

"ఛీ. ఎంత అహంకారం. ఏవిగర్వం. మాటవరసకి నువ్వా గొప్పవాడవే లేవయ్యా అంటే ఔననుకుంటాషూ. ఎంత గొప్పవాడైతేనుటుకు, ఒప్పేసుకుంటాడూ. అలాటివాడికి సన్మానం చేస్తే మన గొప్పేవిటి ?" అన్నాడు మహానటుడు.

ఆయన పూర్వాశ్రమంలో కవి. ఒక తాత్కాలిక యుగకర్త. దరిమిలాను వినయం ఎక్కువై తాను కవిత్వానికి అనర్హుణ్ణని, ఇన్నాళ్ళు కవిగా అభినయం గలిగినట్టు ఈ మధ్యనే పసిగట్టి తన ప్రజ్ఞ నటనలో ఉందని గ్రహించి ఇందులో జొరబడ్డాడు.

"ఈనాలుగు పాయింట్లూ జోడించి, మనం అవతల పోటీదార్ని చితగ్గొట్టెయ్యొచ్చు. వారు దేశసేవకులుగా చేస్తున్న అభినయం అద్భుతమనీ అందువల్ల వారు రంగం ఫిరాయించి రాజకీయాల్నించి కళారాజకీయాలకు దయచెయ్యడం మంచిదనీ మీరు స్పీచి కొట్టి వాణ్ణి చిత్తు చెయ్యొచ్చు. అందుచేత ఆ సన్మానం వీరికే చేస్తే బాగుంటుంది. నిమిషంలో రాయించుకొస్తాను. శ్రీకాలం హెడ్డింగుతోవస్తుంది రేప్పేపర్లో" అన్నాడు కార్యదర్శి.

"మీరంతా బలాత్కరిస్తే నాదేముంది" అన్నాడు నటుడు సవివరంగా పైకిచూడబోయి.

వలంటీరు తలుపుతీసుకు బయటికి వెళ్లాడు. గది గోలెత్తిపోయింది. వలంటీరు మైకులోంచి మళ్లీ మార్పు ప్రకటించాడు. 'ఆర్యులారా! ఇందాక చిన్న పొరపాటు. వక్తగారి పేరును పరాకున సన్మానితుడుదిగా ప్రకటించితిమి. ఇపుడు సన్మానం జరిగేది సుప్రసిద్ధ మహానటుడు గారికి. కారణం కళ్లు నెత్తికెక్కకపోవడం' అన్నాడు ముక్తసరిగా.

* * *

పైకి చూడబోయిన మహానటుడు అదిరిపడి చేత్తో మొహం తడుముకున్నాడు. ఆయనకి ఆ గది పై భాగం అంతా బర్మాలో వెదురు పొదల అడివిలా కనబడింది. మళ్లీ మొహం తడుముకున్నాడు. కళ్లు రివాజైన చోటలేవు. బాగా పైకి జరిగి నెత్తిమీద, జులపాల మాటున ఉన్నాయి. రెప్పలార్చి కంగారుగా చూస్తున్నాడు భయంతో.

'హా రామచంద్రా రక్షకా!' అన్నాడు శాస్త్రిలవారు.

హోరుమంటున్న చప్పుడుతో వలంటీరు లోనికి వచ్చేసరికి అందరికి చెవులు గళ్లు పడ్డాయి. 'ఏడున్నరయింది. జనం గోల కంట్రాక్టు నాటకాల ఆడియన్సు కన్న కనాకష్టంగావుంది' అన్న మాట ఎవరికీ వినబడలేదు. కాని ఒకనిముషం తరవాత....అందరికీ తుమ్మెద ఝుంకారంలాటిది మంద్రస్వరంలో శ్రుతిపేయంగా వినబడుతుంది. ఐదు, పది అనే మాటలు వినిపిస్తున్నాయి. చేతులు జేబుల్లోకి వెళ్ళొచ్చి, మంత్రముగ్ధలు అయినట్లుగా ఐదూ పదీ, అర్ధా పర్ధా ఇచ్చేస్తున్నాయి.

"చాలా థాంక్సు. ఇంత మంది సహృదయులు ఒక్కచోట పోగడ్డం చూసి చాలాకాలం అయింది. మీ అప్పులన్నీ నెల్లాళ్ళలో ఇచ్చేస్తాను," అన్నాడు అప్పారావు సర్వజన మనోహరంగా నవ్వుతూ.

నల్లగా, పొట్టిగా, నవ్వుతూ ముద్దొస్తున్న ఆ మనిషిని అందరి కళ్లు విప్పార చూశాయి. అందరిలోనూ ఒకేమారు స్నేహం, ప్రేమ, గౌరవం పెల్లుబికాయి.

సభపెద్ద, పెద్దబ్బాయిగారి చిన్న అమ్మాయి బుణసుందరి హఠాత్తుగా తలుపుతోసుకు లోపలికొచ్చి అప్పారావునిచూసి క్షణం సిగ్గుపడి, "వీరే నాన్నా వీరే." అంది. తరవాత ధైర్యం తెచ్చుకుని "జీనియస్ నాన్నా. అప్పులమీద ఇంత అనర్థాన్ని నేనెక్కడా చూళ్ళేదు. ఎంత పోగ్గా అప్పుచేస్తాడు తెలుసా! ఎన్నో

చెప్పాడు. నానోన్నెయ్ మరేం, రూమ్మేటుకి మనియార్డర్ రాగానే అప్పుచేస్తాం చూడూ, అప్పుడేమో అస్సలు ఒక్క అరనిమిషం కూడా ఆగకూడదుట. పోస్టుమాన్ ఇలా ఇచ్చీ ఇవ్వగానే ఆ వేడిలో లాగేసుకుంటే అవతలి వాళ్లకి నొప్పి తెలీదట. మనం ఇన్నాళ్లో రాంగ్ మెథడ్ రైటనుకున్నాం—''

పెద్దబ్బాయిగారు అమ్మాయిమాట వినలేదు. అమాంతం అప్పారావుని కౌగలించుకొని, "ధన్యుణ్ణి, ఇన్నాళ్లు మీ కీర్తి వినడమేగాని చూడ్డం పళ్లేదు. ఇప్పుడు వెదకబోయిన ఋణదాతలా ఎదురయ్యారు. మీకన్న గొప్ప కళాకారుడు మాకు దొరకడు. మీకు కాస్సేపు సన్మానం చేసుకుంటాం. టైము వేస్టని తెలుసనుకోండి. కాని కాదనకండి'' అన్నాడు.

కా. మంత్రిగారు ఆలోచించకుండ తల తాటించి, ప్రాధేయపూర్వకంగా చూశారు.

కళ్ళజోడు వక్తకి ఒళ్ళు మండింది. 'ఏవిటిసార్! ఏవిటి వీరిగొప్ప. అప్పులెవరు చెయ్యరు? తెల్లార్లేచింది లగాయతు అడ్డమైనవాడు చేస్తునేఉండే. లక్షసార్లు చేశాం. ఇంకా లక్షసార్లు చేస్తాం. అవసరం ఉండకా తప్పదు;



"ఏమోయ్ ఈమధ్య పెళ్ళిచేసుకున్నావుటగా?"
"ఔనోయ్ హోటలుభోజనం బాగాలేదనుకుని పెళ్ళిచేసుకొన్నాను."
"ఇప్పు డెలాగుంది?"
"మళ్ళీ హోటల్లోనే భోజనం చెయ్యాలనుకుంటున్నానోయ్."

అప్పు చెయ్యకా తప్పదు' అన్నాడు తీవ్రంగా.

అప్పారావు చప్పట్లు కొట్టాడు. తల పైకెత్తాడు. పీరుడు, విలాసంగా నవ్వాడు. జాలిగా చూశాడు.

"నేను అవసరముంటేనే అప్పు చెయ్యాలనుకోను. పువ్వు లెందుకు పూస్తాయి? పిల్లలెందుకు నవ్వుతారు? నేను అందుకే అప్పుచేస్తాను— కోకిల లెందుకు కూస్తాయి? .... నేనుఅందుకే — సెలయేళ్లెందుకు గలగల

మంటాయి?....అందుకే....కృష్ణశాస్త్రి గారెందుకు కవిత్వం చెబుతారు?—డిటో....రామాయణం మళ్లీ ఎందుకు రాస్తారు? సేమ్.... చాలామంది ఎందుకు కవిత్వం చెప్పరు?

అలాగే జలకం ఎందుకు వర్షిస్తుంది? చంద్రుడు ఎందుకు వెన్నెల కాస్తాడు? మీవంటి సహృదయులు ఇప్పుడా ఐదురూపాయలు నాకెందుకు అప్పిస్తున్నారు? అందుకే....

"చూశారా? సూర్యుడు సముద్రుడి దగ్గిర అప్పుతీసుకున్నట్టు, తేటి పూబోటినుంచి తేనె గ్రహించినట్టు, అమ్మాయిగారు పూలు వాసనచూసినట్లు, నేను సహజంగా, మృదువుగా, నొప్పిలేకుండా, తెలియకుండా, ఇలా ఋణగ్రహణం చేస్తాను." అన్నాడు. అని వినయంగా తలవంచుకుని. వక్త చేతిలోంచి అందుకున్నరూపాయినోట్లు ఐదూ ఉన్నాయా లేదా అని లెక్క చూసుకున్నాడు.

కా. మంత్రిగా రుప్పొంగిపోయి, దగ్గిర్లోఉన్న దండ ఒకటి అప్పారావు మెడలోవేసి కావిలించుకున్నాడు.

శాస్త్రిలవారి కళ్లు చెమర్చాయి. 'ఋగ్వేదంలోకూడా ఋణాలగురించి ఉంది. ఆయొక్క ఉషస్సు అనేది, అప్పులనే చీకటి పారద్రోలే ఋణంలా భాసించిందని ఒక వేదర్షి వ్రాశారు' అన్నారాయన బొంగురు పోయిన గొంతుతో....

*　　*　　*

"కదలండి కాలాతీత మయింది" అన్నారు మంత్రిగారు. అందరూ వేదికపక్క, సైడుకర్టెన్ల వెనక నిలచారు, చెవులు రెండు చేతుల్తో మూసుకుని.

వలంటీరు మైకు వాల్యూము పెద్దది చేయించి, "ఈమాటు సభ నిజంగా బిగిసైపోతోంది" అని గావుకేక పెట్టాడు. హాలు దద్దరిలిపోయింది. అంతా నిశ్శబ్దం. అప్పారావు ఓ గులాబీరేకుతీసి కిందపడేశాడు. ధన్మని చప్పుడైంది.

ఇప్పుడు, ఇందాక ప్రకటించిన ప్రకారం ఆమహానటుడుగారికి కాక అప్పారావుగారికి సన్మానం జరుగుతుంది అన్నాడు వలంటీరు. అప్పారావు తొంగిచూసి, సభలో నలుగురైదుగురు నిలబడ్డం గమనించి వలంటీర్ని వెనక్కి పిలిచాడు. ఐదు నిమిషాలు గుసగుసలాడాడు.

వలంటీరు తిరిగి మైకు ముందుకు వెళ్లి "కాదు. నరసింహారావుగారికి సన్మానం" అన్నాడు. అప్పారావు పేరు విని వచ్చినవాళ్లు కూచున్నారు గాని

మరి పదిమంది లేచారు. "అబ్బే, సుబ్బారావుగారికి" అన్నాడు వలంటీరు. వాళ్లు కూర్చున్నా, ఇంకో ఆరుగురు లేచారు ఆశగా.

'కాదు వీరప రెడ్డిగారికి' అన్నాడు వలంటీరు.

ఇలా పొరబాట్లు సవరించుకుంటూ, జలాలుద్దీన్, చమన్‌లాల్, హీరాచంద్ సితానీ, జాన్ హారిసన్, వెంకటేశ్వర్లు, అనే పేర్లు ప్రకటించిచూసి చివరికి భద్రయ్య అన్నాడు. ఏం భద్రయ్య అని సభ అడిగింది. రాంభద్రయ్య అంటే కొందరూ, వీరభద్రయ్యంటే కొందరూ లేచారు.

సర్లెండి ఉత్తభద్రయ్య అన్నాడు వలంటీరు. సభ తటపటాయించింది. ఒకనిముషంలో ఎవరోకాని 'యుభద్రయ్య నాకు బాకీ పాతికివ్వాలి. పత్తా లేదు'. అన్నారు. సభ గొల్లుమంది.

* * *

మంత్రిగారికి నీరసం వచ్చేసింది.

'పోనీ ఓ పని చేద్దాం. సన్మానితుడు కారణాంతరాలవల్ల రాలేదనీ, వారి తరఫున తరుణానికి తోటిపెళ్ళికొడుకులా ఒకర్ని కూచోబెడతామనీ ప్రకటనచేసి, ఈయన్నే కూచోబెట్టి కాండ సాగించేద్దాం" అన్నారు శాస్త్రిగారు.




"ఇది విన్నావా? తండ్రి గుణాలే కొడుకులకి అబ్బుతాయట...."
"మన అబ్బాయిని చూస్తే తెలుస్తూనే ఉంది కదా, వెధవ కోతీ వాడూను"

'కాం డేవిటండీ. ఇదేం తద్దినమా, మన శార్థం" అన్నాడు కా. మంత్రి.

'అలాగే ఉంది' అన్నాడు ఒకవక్త.

"బుణాగ్రేసర చక్రవర్తికి సన్మానం చేస్తున్నపుడు ఆయన గైరుహాజరు కావడమే సహజమును, సముచితమును" అన్నారు వెనకనించి ఇది చూస్తున్న ఒక పెద్దమనిషి.

"అసలా పాయింటుమీద సభని పొట్టచెక్కలయ్యేలా నవ్వించవచ్చు. అసలే విసుగేసి ఉన్నారు. వాళ్లకి విట్లు వినోదం కావాలి" అన్నాడు ఒకవక్త.

మిగతా వక్తలంతా నాలుగో

పారిగా, సన్మానం జరగబోతున్న ఆసామి గురించి ఉపన్యాసా లల్లేసుకుంటున్నారు చకచకా.

"వాళ్ల మొహం. వాళ్ళకేం తెలుసు. తెలిస్తే ఈ అఘోరింపులెందుకు. అయినా వాళ్ళక్కావలసింది చెప్పడానిక్కాదిది. మనక్కావలసింది చెపుకుందికి. నడవండి స్టేజిమీదకి" అన్నారు మంత్రిగారు.

"మీ అసలు పేరేటిసార్!" అన్నాడు కళ్లజోడు వక్త అప్పారావుని చూసి.

"వాటీ జినే నేమ్. మీరు కొన్ని అడగరాదు. దేవుడి అసలు పేరేవిటి?" అన్నాడు అప్పారావు. పక్కన బుట్టలో ఉన్న దండలు లావుపాటివి మూడు తీసుకుని మొహం కప్పడిపోయేలా వేసుకు స్టేజిమీద కెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు దూరం ఆలోచించి.

స్టేజిమీద కూర్చున్నవారిలో ఇద్దరికి దండలు తక్కువైనందువల్ల, ఒక వలంటీరు అప్పారావు దగ్గరకొచ్చి, 'మీ రిన్ని మొయ్యలేరు' అన్నట్టు మొహం పెట్టి బలవంతాన అవిలాక్కుని లోపలికివెళ్ళి మళ్ళీ తెచ్చి మిగతా ఇద్దరికీ వేశాడు.

అధ్యక్షులు పరాకులో, ఆరోజు నిజంగా సన్మానం జరగాల్సిన సుబ్బన్న తాలూకు వినయంగురించి స్పీచి ఆరంభించి నాలిక్కరచుకుని అప్పారావుకేసి చూసి "వీరు" అనేసరికి 'వారు' అక్కడ లేరు.

తన మూడు హారాలలో రెండు పోగానే, ముఖారవిందాన్ని సభలో ఎవరో శ్రద్ధగా చూస్తున్నట్టు పసిగట్టి అప్పారావు తెరవెనుకకు వెళ్ళాడు అర్జెంటు పనున్నట్టు.

పూలమాల లేవీలేవు. వెంటనే గ్రీన్‌రూమ్‌కెళ్ళి అక్కడ తన సంచి తీసుకొని వచ్చాడు. అందులోనుంచి పెద్ద బొర్రమీసం తీసి అంటించుకొని తిరిగి స్టేజిమీదకు వచ్చి కూర్చున్నాడు.

కా. మంత్రిగారు, త్వరలో పెట్టబోయే పార్టీ గొప్పతనం, అందులో పుట్టబోయే గ్రూపు విశిష్టత వివరించి, దానిపాడో కాబినెట్‌లో మొదటిమంత్రిగిరీ ఎవరికి దక్కాలో చెబుతున్నారు.

అప్పారావుకి మళ్లీ అనుమానం వచ్చింది, ఎవరో తనకేసి పరకాయించి చూస్తున్నట్టు. లేచి వింగులోకి పరుగెత్తి బవిరిగడ్డం తగిలించుకుని ముసిముసి నవ్వులు నవ్వుతూ వచ్చికూర్చున్నాడు.

జనం గొల్లున నవ్వారు.

వెంటనే మంత్రిగారు తన పొరపాటు గ్రహించారు. ఆవేశంలో అవతలవాణ్ణి తిట్టడంతో ఆగక, తనకు తనే పబ్లికున పొగిడేసుకుంటున్నట్టు అప్పుడే

ఆయనకు తెలిసింది. స్వపరభేదం కానందుకు చింతించి, తరువాత వాక్యం ఆలోచిస్తూ అప్పారావు కేసి తిరిగి మీసంచూసి గతుక్కుమన్నారు. కాని అంతలోనే తళుక్కున ఆలోచన మెరిసింది. టైము ఎనిమిదిన్నర అవుతూంది. జనం వెళ్లబోతున్నారు. ఇపుడు రాబందుల్లా కాసుకున్న వక్త గాళ్లని వదిలేస్తే ఓపట్టాన మైకుని వదల్రు జిడ్డులా పట్టుకుంటారు. ఈ అప్పా రావుగాడిమీద విట్లు వేస్తు కూచుం టారు. అందుకని తనపని తనే చూసు కోవాలి. చెప్పాల్సిన నాలుగూ తనే చెప్పాలి ఏదోవిధంగా....

"ఒక్క నిముషం క్షమించాలి" అంటూ ఆయన ఒక్కఅంగలో స్టేజీ మాటుకెళ్ళి అక్కడ అప్పారావు గడ్డం పెట్టుకుంటూ వదిలేసిన మీసం తగిలించుకుని కోటువిప్పేసి స్టేజీమీద కొచ్చేసి, "ఇపుడు శ్రీనరసింహారావు గారు మాట్లాడుతారు" అని ప్రక టించి వెంటనే, 'పెట్టబోయే పార్టీ పుట్టబోయే గ్రూపు అందులో తన ఆశయం' వివరించాడు.

ఆయన ముగించేసరికి - ఆరుగు రేనా ఉపన్యసించాలి గాబట్టి ఎవరికీ ఐదు నిముషాలకు మించి వ్యవధి ఇవ్వదల్చు కోలేదు - అప్పారావు హడావుడిగా వింగులోకి వెళ్ళి గడ్డం వదిలేసి, పెద్ద విక్రమార్కుడి మార్కు జుట్టు విగ్గు పెట్టుకొని చొక్కావిప్పేసి ఉత్తరీయం వేసుకుని వచ్చి కూర్చున్నాడు. పక్క నున్న వక్త "మీ కెన్నిరూపాలో ?" నిజరూపం ఏది అని అడగబోయి, దేవుణ్ణి తలుచుకున్నాడు.

తత్క్షణం 'నరసింహారావుగారు' వింగులోకి పరిగెత్తి, అప్పారావు వదిలేసినగడ్డం తగిలించుకొచ్చి "ఇపుడు శ్రీ నరసయ్యగారుపన్యసిస్తారు" అని ప్రకటించి పెట్టబోయే పార్టీ, పుట్ట బోయే గ్రూపూ అందులో తన....

అప్పారావుకి స్థిమితం తగ్గిపోతోంది. ఇపుడు ఎవడో తన కేసి అనుమానంగా చూస్తున్నాడు. వెంటనే వింగులోకెళ్ళి స్టేజి మానేజర్ని బతిమాలుకొని కిరీటం, కత్తి, భుజకీర్తు లున్న ధర్మరాజు చొక్కా; పంచె, చడావులు అడిగి పుచ్చుకుని అవి ధరించి స్టేజిమీదకొచ్చి వినయంగా నవ్వి కూర్చున్నాడు పూలలో రేకులు లెక్కెడుతూ.

'నరసయ్యగారు' స్పీచి ముగించ గానే, వెళ్ళి, విగ్గుపెట్టుకొనివచ్చి, 'శ్రీ నయనప్ప మాట్లాడెదరు' అని ప్రక టించి మూడో లెక్చరు ఆరంభించాడు.

అప్పారావు ఈసారి రెండు నిము షాలలోనే లోపలికి పరుగెత్తి కీచకుడి

కాస్ట్యూము వేసుకువచ్చాడు. అప్పు లాళ్ళు ఝడుసుకుంటారన్న ఆశతో.

'నయనప్ప'గారు లోపలికి పరు గెత్తి ధర్మరాజు వేషం వేసుకుని కత్తి ఝళిపిస్తూ "ఇపుడు శ్రీ జాన్ హారిసన్ గారు మాట్లాడతారు'' అంటూ నాలుగోవిడత ఆరంభించాడు.

అప్పారావుకి కీచకుడి డ్రెస్సు నప్పక ద్రౌపది వేషం వేసేలోగా సభలో సంరంభం, గంద్రగోళం చెలరేగింది.

పక్కవీధిలో జరుగుతున్న మీటిం గులో, పెట్టబోయేపార్టీ (ఇదే) లోని పుట్టబోయే గ్రూపుకి నాయకుడుగా అక్కడి పెద్దమనిషినే ఏకగ్రీవంగా ఎన్నేసుకున్నారనీ, మినిస్ట్రీలో ఆ గ్రూపుకి రెప్రజెంటేషన్‌గా సీటిచ్చి నపుడు ఆయనకే ఇవ్వాలని తీర్మానం పెట్టేశారనీ కబురువచ్చింది. ఆ గ్రూపు ఊరేగింపుకూడా జరుగుతోంది. వాళ్లు కాసేపు గుమ్మంలోనుంచి కేకలువేసి, ఇక్కడెలాగా జనం రెడీగా ఉన్నారు కాబట్టి ఇక్కడో సన్మానసభ చేయా లని నిశ్చయించారు.

'సన్మానం సన్మానం' అని ప్రకటన చేశారు. ముఖ్యులంతా గ్రీన్‌రూమ్‌లో జొరబడ్డారు. కాబోయిన మంత్రి గారుకూడా అందులో కలిసిపోయి ప్రముఖపాత్ర వహించారు.

ఎవరికి సన్మానం చెయ్యాలన్న ప్రశ్నతో గదిలో జనం వాదించుకుం టున్నారు. అవతల హాలులో జనం ఆలస్యాన్ని సహించలేక కేకలు ఈలలు వేస్తున్నారు.

కాబోయి మానేసిన మంత్రిగారికే కానందుకు సన్మానంచేస్తే అద్భుతంగా ఉంటుందనీ, తద్వారా పార్టీలో ఐక మత్యం సిమెంటులా గట్టిపడూరుకుం టుందనీ కా. మంత్రిగారి కార్యదర్శి సూచించాడు.

"ఔనౌను. తా మట్టి వెధవలన్న ముక్కను వినయంతో అంగీకరించి మంత్రిగిరిని త్యాగంచేసిన స్వార్థజీవి'' అన్నాడొక ఉద్రేకి.

కా. మంత్రిగారు సగర్వంగా వినయం నటించారు.

గదిలో అందరూ హాహాకారాలు చేశారు. ఆయనకి నెత్తిమీద హఠా త్తుగా రెండు కొమ్ములు మొలిచాయి.

రెండోసారి అప్పులు నొల్లుకోడాని కొచ్చిన అప్పారావు ఆగదితలుపు తెరిచి మళ్లీ మొదలాఅని నిర్ఘాంతపోయితలుప లాగే వదిలేశాడు. అవతల హాలులో ఆలస్యానికీ, ఇవతల గదిలో ఈ అఘాయిత్యానికీ చెలరేగిన హాహాకా రాలు కలిసి హోరెత్తిపోయే సరికి ఆ 'భవన భువనం'దద్దరిలిపోయింది. ★